# లోకాన్నుద్దేశించి వ్రాసిన లేఖ!

ఆన 1959వ సంవత్సరము, జులైనెల 1వ తేదీ రాత్రి 9–15 నిమిషాలకు, కమతం దేవయ్య 3వ కుమారుడు, గోపాలం అనే నేను, ఎలాంటి మతిభ్రమణములేని స్థితిలోఉండి, ఈలేఖ వ్రాస్తున్నాను. ఇలాంటి ఉత్తరం వ్రాయమని, నన్ను, ఏ ఒక్కరూ ప్రత్యేకంగా బలవంతం చెయ్యలేదు. హృదయ పూర్వకంగానే వ్రాస్తున్నాను.

ఉత్తరం ముగించాక, చాలాకాలంనుండీ, నేను చెయ్యాలనుకొంటున్న, ఆ పనిని, ఈపూట చేస్తాను. బహుశ, ఈలోకంలో, నేనుచేసేపని, అదే చివరదికావచ్చు...

ఈపని చెయ్యకుండా ఉండాలనీ, జీవితంలోని మాధుర్యాన్ని, ఏ కొంతగానైనా, అనుభవంలోకి తెచ్చుకుందామనీ, నేనువిశ్వప్రయత్నాలుచేశాను. బ్రతుకుపట్ల ఉత్సాహాన్ని, ఆపేక్షనూ, కలిగించుకోవాలని, చాలాసంవత్సరాలు కృషి చేశాను. ఇన్నిసంవత్సరాలతర్వాత నేను గ్రహించిన సత్యమేమిటంటే, నాలాంటి సామాన్యునికి, ఈలోకంలో జీవించే హక్కులేదనీ, ఆ హక్కు ఏకొద్దిమందిచేతుల్లోనో ఉండిపోయిందని, తెలుసుకొన్నాను.

వారి హస్తాలలో బంధింపబడిన, ఆ హక్కును – కనీసం, అందులో ఏ కొద్దిభాగాన్నయినాసరే, చేజిక్కించుకొంటానన్న ఆశమాత్రం, నిన్న మొన్నటిదాకా నన్ను పీడిస్తూఉండేది. ఈ ఉత్తరం వ్రాస్తున్న వేళకు–సరిగా ఎనిమిది

గంటలక్రితం, ఆ ఆశారేఖకూడా, అంతరించిపోయింది. నేను గాఢంగా విశ్వసించినవారూ, అభిమానించినవారూ, నన్ను నిలువునా మోసంచేశారు. నాజీవితంతో చెరలాట లాడారు.

పరిస్థితులన్నీ, రేచుల్లా నన్ను తరిమితరిమికొట్టాయి. వాటి బారినుండి తప్పించుకోనేందుకు, ఇక్కడికొచ్చి నిలువ బడ్డాను. ముందుకెళ్ళే ఓపికలేదు. మార్గమంతకన్నా లేదు. అయినా, రేచుకుక్కలు తరమడంమాత్రం మానలేదు. ఆ కుక్కలకు లొంగడం నా కంతకన్నా ఇష్టంలేదు. వాటి మీద విజయం సాధించడానికి, నా కొక్కటే మంచిమార్గం కనిపించింది. తరిమే అవకాశం వాటికి లేకుండా చెయ్యాలి. వాటికి అందకుండా శాశ్వతంగా, ఈ లోకానికి దూరం కావాలి.

ఆత్మహత్య చేసుకోబోయేముందు, నే నెందుకు ఆపని చేశానో, మీకు చెప్పదలచాను. ఏయే పరిస్థితులు, నన్నీ మహాకార్యానికి పురిగొల్పాయో వివరించదలచాను. ఈ వివరాలు, అందరికీ ఉపయోగపడతాయని, నే ననుకోను. కనీసం, కొందరైనా, ఉపయోగపెట్టుకుంటే, నా ఈ ఆత్మ హత్య, ఫలప్రదమౌతుంది.

"ఈ చివరి నిమిషాల్లో ఏ కొందరి పేర్లనో ఉదహరించి, వారిని అప్రతిష్ఠపాలు చెయ్యడానికి నా అంతరాత్మ అంగీక రించడంలేదు. అయినా పేర్లతో పనేమిటి ? మొత్తం లోకమే నన్ను భయపెట్టింది. మోసగించింది. అవమానిం చింది. అడుగడుగునా అగాధాలు తవ్వింది. తియ్యగా

మాట్లాడుతూనే, చాటుగా గుప్పానుని, విషధూళిని మీదికి ఎగజిమ్మింది. విషవలయాలను, నాచుట్టూ పన్నింది. ఈ లోకంమీద సవాలుగానే, నేను ఆత్మహత్య చేసుకొంటున్నాను. రేపు ఉదయానికల్లా, ఈ లేఖ దానికళ్ళ బడుతుంది. నా పట్ల తనుచూపిన అమానుషత్వానికి, అన్యాయానికి, లోకంతల సిగ్గుతో కుంగిపోవాలి. పశ్చాత్తాపాగ్నితో దానిగుండెలు అగ్గికొండల్లా భగ్గుమని మండిపోవాలి. ఓ సాహితీపరుణ్ణి కోల్పోయినందుకు, కలకాలం, దుఃఖముతో కుమిలిపోవాలి. బ్రతికిఉండి నేను, చెయ్యలేని ఈ పనులన్నీ చచ్చి సాధించదలచాను. నాకు తెలుసు — ఈ నా చివరిఅస్త్రం, గురితప్పదు. సూటిగా తగలవలసిన చోటే తగులుతుంది ! నా కోపమంతా మనిషిమీదగాదు; మొత్తం మానవలోకం మీదే !" అని రాస్తున్నాడు. గోపాలం.

"అది తెలుసుకుందామనే వచ్చాను." అంటూ వో వ్యక్తి లోపలి కొచ్చాడు.

"ఏయ్ ! ఎవరు నువ్వు ? ఎందుకిలా అర్ధరాత్రి నా గదిలోకొచ్చావ్ ?"

"నీతో సంజాయిషీ చెప్పుకొందామని వచ్చాను. అన్నట్టు — ఇంకా అర్ధరాత్రి కాలేదు" అన్నా డతను.

"నీతో వాదించటానికి నాకు టైములేదు. దయచేసి త్వరగా వెళ్ళు. 9-30 దాటకుండా, నే నొక గొప్పకార్యం చెయ్యబోతున్నాను" అన్నాడు గోపాలం.

"9-30కు, నీ భార్యాబిడ్డలూ వస్తారని భయపడు

న్నావు. వారుండగా ఆత్మహత్యచేసుకొనేపాటి ధైర్యం గూడా లేనివాడివి కదూ ?"

"సమాధానం చెప్పవలసిన అవసరం నాకులేదు. ఇప్పటికే, నా టైం చాలా ఖర్చుపెట్టావు. దయచేసి నీవు ఎంతత్వరగా వెళ్ళితే అంతమంచిది" అన్నాడు గోపాలం విసుగ్గా.

"ఎదుటివారి జవాబులు వినే ధైర్యంలేనివాడివి. వారి మీద నేరారోపణ చెయ్యడం తప్పుగాదూ ? ... ఒక్కసారి ఆ ఉత్తరమిలా ఇస్తావా ?" అన్నాడతను చెయ్యిచాపి.

"ఇది నా స్వంతవిషయం, ఇందులో నీవు జోక్యం చేసుకోకు."

"ఆ ఉత్తరం - రేపయినా అందుకోవలసింది నేనే ! రేపు చెప్పవలసిన సంజాయిషీ ఇప్పుడే చెబుదామని — వచ్చాను. మనిషిగా కాదు; మానవలోక ప్రతినిధిగా నీ దగ్గరకొచ్చాను. ఇప్పుడు చెప్పు గోపాలం, నామీద నీ కెందుకంత కోపం?

"ఒక్క కోపమే కాదు, రోత, అసహ్యం, జుగుప్స, ఇంకా, ఇంకా చాలాఉన్నాయి. ఈ చివరినిమిషాల్లో, వాటి నన్నింటినీ తవ్వి, నా మనశ్శాంతిని భంగంచెయ్యకు. నన్ను ప్రశాంతంగా మరణించనివ్వు."

"జవాబుఅయినా వినే ధైర్యం లేదా నీకు?" అన్నాడతను.

"కాదు, ఆ హక్కు నీకులేదు. నీ చుట్టూ అన్యాయాలు, అధర్మాలూ, అక్రమాలూ, పుంఖానుపుంఖంగా

జరుగుతున్నపుడు, నువు చూస్తూ కూచున్నావు. పల్లెత్తి ఇది యేమిటి అన్న పాపాన పోలేదు"

"అదెవ్వడు ?"

"ఎందుకంత అమాయకత్వాన్ని నటిస్తావ్ ? నీసంగతి నాకు బాగా తెలును. దాదాపు 33 సంవత్సరాలు నీతో కలసి ఉన్నాను."

"నిజమేగానీ; నన్నుగురించి నీకు తెలిసింది చాలా కొద్ది" అని నవ్వాడతను.

"కావచ్చు. ఈ తెలిసిన మేరకే నేను ఉక్కిరిబిక్కిరయి పోయాను. ఇప్పటికే నీవంటే, నాకు పరమ అసహ్యంకలిగింది. నాతో ఆట్టేమాట్టాడకు. ఇక టైంలేదు. త్వరగా ఈ ఉత్తరం ముగించాక—."

"నిన్ను వాగించాలని నేను రాలేదు. నామీది నేరాలకు, సమాధానం చెప్పుకొందామనిమాత్రమే వచ్చాను." అన్నాడతను.

"తరువాత చెప్పు. ముందు నన్నీజాబు రాసుకోనివ్వు. నన్ను చాలామంది మోసగించారు. అన్యాయంచేశారు. అందులో మొట్టమొదటివాడు మానాన్న! మాఅన్నయ్యలు, ప్రతిక్లాసు రెండేసిసంవత్సరాలు చదివారు. వాళ్ళ చదువుల క్రింద మానాన్న వేలకువేలు ఖర్చుబెట్టాడు. కానీ, ఒక్కసారిమాత్రమే నేను, పరీక్ష తప్పాను. ఆనాటితో నన్ను చదువు మానిపించాడు. మాఅన్నలిద్దరూ ఇప్పుడు, హాయిగా ఉద్యోగాలు చేసుకొంటున్నారు. నేనిలా బికారినయ్యాను.

మానాన్న, ఆనాడలా పక్షపాతం చూపకపోయినట్లయితే—." అంటున్నాడు గోపాలం.

"ఎందుకు నీచదువు మానిపించాడో నాకు తెలుసు." అన్నాడా వ్యక్తి.

"నిన్నడగలేదు...నన్ను ఉత్తరం రాసుకోనివ్వవా ఏం?" అని కసిరాడు గోపాలం

"ముందా వాక్యాలు కొట్టెయ్యి."

"నేను నిజమే రాశాను."

"కాదు గోపాలం. అప్పట్లో మీనాన్న స్థితిగతులు నీకు సరిగ్గా తెలీవు. పొలాలన్నీ, మీ అన్నల చదువులక్రింద చెల్లిపోయాయి. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. పట్నంలో ఉన్న నీ కా సంగతులేమీ తెలియవు. పస్తులుచేసి, నీకు డబ్బు పంపించారు. ఒకసారి డబ్బుకావాలంటూ నువ్వు జాబురాశావు. అప్పటికి రెండురోజులైంది. మీ యింట పొయ్యిరాజేసి. ఆ ఉత్తరం పట్టుకొని, మీనాన్న, తెలిసిన వారిదగ్గరకెళ్ళి, యాచించాడు."

*　*　*

గోపాలం డబ్బుకావాలని ఉత్తరంరాశాడు నారాయణబావా! చేతిలో చిల్లిగవ్వలేదు. రెండువందలుంటే ఇవ్వు ...ఇంటిప్రక్కనున్న ఇల్లు. తీర్చగలిగితే బాకీ, వడ్డీతో సహా తీరుస్తా. లేదా, ఇల్లు నీకు విక్రయం రాసిస్తా. పెద్దవాళ్ళ దరికీ ఏదో, చెప్పించా. పెళ్ళాలురాగానే, వాళ్ళెళ్ళిపోయారు. నాకీ చిన్నవాడితోనే చిక్కుగా ఉంది బావా! వాడొచ్చే

సరికి దరిద్రంతప్ప ఏమీా మిగల్లేదు. కాస్త ఆ అక్షరమ్మొక్కేనా లేకపోతే, వాడు మరీ అన్యాయం అయిపోతాడేమోనని పాకులాడుతున్నా.

అంటూ, నారాయణకు చెప్పుకున్నాడు. అతనిచ్చిన రెండువందలు నీకు పంపించాడు. ఆ డబ్బు నువ్వెలా ఖర్చుచేసిందీ నాకు తెలుసు. కనపడ్డ ప్రతిపుస్తకమూ కొన్నావ్! స్కూలుమానేసి కథల పుస్తకాల్లో మునిగిపోయావ్. పరీక్షతప్పి కూచున్నావ్. చదువుమీద ధ్యాసతప్పిందని మీా నాన్నకు తెలుసు. అందుకే మానిపించాడు. ఒకవేళ ఇంకా మీా నాన్న చదివించినా, నువ్వు చదివేవాడివేనా?" అని నిగ్గదీశాడా వ్యక్తి.

"లేదు. అప్పటికే నాకు స్కూలంటే అసహ్యమేసింది. నిజమైనచదువు అది కాదనిపించింది. సాహిత్యసేవ చెయ్యాలనుకొన్నాను. స్కూలుపుస్తకాలను గిరాటెట్టి, రచనావ్యాసంగం ప్రారంభించాను. నేను అన్యాయమనుకొన్న విధానాలన్నింటినీ, నా రచనల్లో ఖండించాను. పత్రికలు, నా కథలను ప్రముఖంగా ప్రకటించాయి. పాఠకులు నాకెన్నో ఉత్తరాలు రాశారు."

"నాకు తెలుసు. సుమతి నీ భార్యగాక ముందు, నీకు పాఠకురాలు. తొలిసారిగా మీాకు ఉత్తరాల పరిచయం మాత్రమే ఉండేది. ఆ తరువాతనే ఆమెను నువ్వు పెళ్ళాడావు."

"అందులోనూ నేను వంచింపబడ్డాను. అక్కడా నాకు మోసమే యెదురయింది. అందరి అల్లుళ్ళకూ వదేసి

వేలు కట్నమిచ్చినా, జగన్నాథం, నాకు చిల్లిగవ్వగూడా ఇవ్వలేదు" అంటూ నవ్వాడు గోపాలం.

"అతను ఇవ్వననలేదే! ఆరోజు రాత్రి, మీనాన్నతో స్పష్టంగా చెప్పాడే!"

జగన్నాథం :- బావగారూ! ముగ్గురు ఆడపిల్లలపెళ్ళి చేసేటప్పటికి నావళ్ళు గుల్లయింది. అయినా భగవంతుడిచ్చినంతవరకూ, సుమతికి అన్యాయం చెయ్యను. ఇదివరకు లాగా, పదేసివేలు కట్నాలిచ్చుకోలేను. ఉభయఖర్చులూ పెట్టుకొని, అయిదువేలిస్తాను. అంతకుమించి దమ్మిడీ నావల్ల పెగలదు... అందులోనూ అమ్మాయీ అబ్బాయీగూడ ఇష్టపడ్డారు. మీరు సరేనంటే, రేపే తాంబూలాలు పుచ్చుకొందాం. శ్రావణమాసంలో ఆ నాలుగక్షింతలూ వేసేద్దాం. మీ ఉద్దేశమేమిటి ?

"అని స్పష్టంగా అడిగాడు మీనాన్న ఉద్దేశం. అయిదువేలయినా ఒప్పుకొందామని, ఆ డబ్బుతో నిన్ను చదివించడమో, లేదా, నీచేత, ఏదన్నా వ్యాపారం చేయించడమో, చేద్దామనుకొన్నాడు" అన్నాడా వ్యక్తి గోపాలం కేసి, పరిశీలనగా చూస్తూ.

"ఆ సంగతి నాతోనూ అన్నాడు నాన్న."

"అయినా నువ్వొప్పుకోలేదు. కట్నం తీసుకోవడమంటే, డబ్బుకు అమ్ముడుబోవడమని నీ ఉద్దేశం. అందుకే, చిల్లికానీ పుచ్చుకోకుండా సుమతిని పెళ్ళాడావు. ఇందులో మీ నాన్న చేసిన అన్యాయమేమీ లేదే!"

"ఒకోసారి సదుద్దేశాలుగూడా చాలా చెడ్డఫలితా

లిస్తాయని నాకిప్పుడే తెలిసింది. డబ్బు దక్కలేదు. సరే గదా—కనీసం—సుమతితో సుఖజీవనంగూడా దక్కలేదు. రానురాను సుమతి రాక్షసిలాగా తయారయింది. ఒకప్పటి సుమతికీ, ఇప్పటి సుమతికీ పోలికలేలేవు. మా ఇద్దరికీ పెళ్ళి కాకముందు, సుమతిరాసిన ఉత్తరాలు, ఇంకా నా దగ్గర ఉన్నాయి. ఒక ఉత్తరంలో సుమతి ఇలా రాసింది:"

సుమతి :- గోపీ! ఇప్పుడు నీ కథ చదివాను. చాలా అద్భుతంగా ఉంది. చదువుతున్నంతసేపూ నాకు నవ్వాగ లేదు. పేర్ల మార్పు తప్ప, కథంతా మనిద్దరిదే. నే నన్న మాటలన్నీ యథాతథంగా రాశావు. నువ్వు చాలా చిలిపి వాడివి గోపీ! నా కళ్ళల్లో కళ్ళుపెట్టి చూడటమూ, నువ్వు దగ్గరగావచ్చి...అవన్నీ పత్రికల్లో కెక్కించడం మంచిదేనా? నీ కథల్లో నాయికానాయకులు పెళ్ళిచేసుకొని కలకాలం మధురంగా జీవిస్తారు. ఆ అదృష్టం మనకుమాత్రం ఎందు కుండాలి?"

అని రాసింది. పెళ్ళయినతర్వాతగూడా, కొద్ది రోజులవరకూ, సుమతిలో ఏలాంటిమార్పూ లేదు. ఓసారి పుట్టింటినుండి సుమతిరాసిన ఉత్తరమిది :

సుమతి:- గోపీ! క్షమించు-పరిచయంకొద్దీ మామూలుగా రాసినట్టు రాశాను. రైల్లో నన్నువిడిచి మీరు వెళ్ళి పోయాక, నాకు ఉప్పెనగా దుఃఖంవచ్చింది. పోతున్న బండి లోంచి దూకి, మీ దగ్గర కొచ్చేద్దామన్నంత ఉద్రేకం కలిగింది...ఇక్కడ నాకేమీ తోచడంలేదు. ఏపని చేద్దామన్నా, మీరే కన్పిస్తున్నారు. ఒంటరిగా ఉండటానికి భయ

మేస్తోంది. కన్ను మూస్తే, మనఇల్లు, పుస్తకాలబీరువా, చిన్నగది, మీరు చదువుతూ కూచోవటం, నేను రాగానే పుస్తకాన్ని మూసి—ఇవే ఆలోచనలు. ఒక్కోరాత్రి ఎందుకో మెలుకువ వొస్తుంది. మీకోసం ప్రక్కకుతిరిగి చూస్తాను. క్షణకాలం పిచ్చిగాఉంటుంది. మరిక రాత్రల్లా నిద్రపోతే వొట్టు. నాన్న మరో పదిరోజు లుండమంటున్నాడు. మీరు లేకుండా పదిగంటలుకూడా నే నిక్కడ ఉండలేను. నా అంతట నేను బయలుదేరితే బావుండదు. హోటలుతిండి సరిపడటంలేదని నాన్నకు వెంటనే కార్డు రాయండి. తమ్ముణ్నయినా తీసుకొనివస్తాను. రాయకపోతే నామీదఒట్టేసుమా! ఉంటాను.

మీ, సుమతి.

"ఇంతగా అలమటించిన సుమతికిగూడ నేను వెగటయ్యాను. ఆశించింది ఒక్కటయితే, చేతికిచిక్కింది మరొకటయింది" అని నిశ్వసించాడు గోపాలం.

"మళ్ళీ నీకు అడ్డువస్తున్నాను."

"ఈ రాత్రి నన్నీ ఉత్తరం పూర్తి చెయ్యనివ్వవనుకొంటాను!"

"సుమతినిగురించి రాసిన వాక్యాలుగూడా కొట్టెయ్య—'ప్రేమ' భ్రమలాంటిది నాయనా! ఒక్కో సమయంలో, భ్రమకూడా నిజంలాగానే ఉంటుంది. 'కల' ఎంత బాగాఉన్నా, మెలకువరాగానే విచ్చిపోతుంది. ప్రేమగూడ

అలాంటిదే! ఒకదశలోని నిద్రలో, 'ప్రేమస్వప్నం' మధురాతి మధురంగా ఉంటుంది. మెలకువ వచ్చాక, ఆ స్మృతి మాత్రమే మిగులుతుంది. అంతే!"

"నేనంత తేలిగ్గా తీసుకోలేను."

"సుమతి—నువ్వాశించినట్టు లేదంటున్నావుగాని, ఆవిడాశించినట్టు నీవు వున్నావో లేవో, ఎప్పుడన్నా ఆలోచించావా? అందమైనమేడ, ముందు తోట, ఇద్దరు పిల్లలు, కారు, రేడియో, పనిమనుషులు, నగలు, డబ్బు, పదిమందిలో హోదా, ఇవన్నీ సుమతి ఆశించింది. ఆవిడ కోరుకొన్న వాటిల్లో, పిల్లలుతప్ప అన్నికోరికలూ ఎండిపోయాయి. తన కలలన్నీ కరిగిపోయినందుకు, నీలానే సుమతి గూడ చిరాకుపడటం తప్పా?" అన్నాడతను.

"కాదు—నన్నిక పలకరించకు. ముగింపువాక్యాలు రాసి, ఈ జాబును పూర్తి చెయ్యనివ్వు. (క్షణంఆగి) ఉద్యోగంకోసం సవాలక్షప్రయత్నాలు చేశాను. ఇస్తామన్నవారందరూ, చల్లగా జారుకొన్నారు. ఇచ్చినఉద్యోగాలు నేను చెయ్యలేకపోయాను. చెయ్యగల ఉద్యోగాలు నాకు అందుబాటులో లేవు. మధ్యాహ్నంవరకు, ఆ పత్రికలో ఉద్యోగం నాకొస్తుందనుకున్నాను. తీరా వెడితే, సంపాదకుడి మేనత్తకొడుక్కు ఆ పోస్టు వేశారని తెలిసింది! నేనంటే చాలా అభిమానమున్నట్టు, నటిస్తాడు. దొంగవెధవ !!"

"కోప్పడకుండా ఈ భాగంకూడా ఉత్తరంలోంచి

తొలగించు గోపాలం! మాటవరసకు అనుకొందాం; నీదగ్గర నాలుగంటే నాలుగణాలేఉన్నాయి. నీ చిన్నకొడుకు, తాయిలం కొనిపెట్టమన్నాడు, సరిగ్గా అదేసమయానికి, ఓ బిచ్చగాడు నీ దగ్గరకొచ్చాడు. వాడికి ఆ నాలుగణాలూ ఇస్తే, ఆ పూట నీ పేరు చెప్పుకొని ఇంతతిండి తింటాడు. కానీ నువ్వివ్వవు. నీ కొడుక్కి తాయిలమే కొనుక్కెడతావ్! నువ్వు చేసిన పనినే, ఆ సంపాదకుడూ చేశాడు. బిచ్చగాడు నిన్ను నీచుడంటే అర్థంలేనట్టే, నువ్వతన్ని అన్నా అర్థంలేదు. నువ్వొకరిపట్ల చూపలేని సానుభూతిని, మరొకరు నీయందుచూపాలని నువ్వెందు కనుకొంటావ్!"

"ఇంక నా ఉత్తరంలో మిగిలిందేమీ లేదు." అని జారగిలబడ్డాడు గోపాలం.

"అంటే నువ్వు లోకంతో రాజీపడుతున్నావన్న మాట. ఆత్మహత్యనుండి విరమించదలచావన్నమాట!"

"లేదు!" అన్నాడు గోపాలం బిగ్గరగా.

"అయితే నువ్వుత్త పిచ్చివాడివి. స్వార్థపరుడివి. నీ సుఖం నీకేగాని, ఎదుటివారినిగురించి ఆలోచించడం నీకు చేతగాదు. నీకన్న గొప్పవారినిచూసి, అసూయపడతావు. కానీ, నీకన్నా అధమాధమస్థితిలో నున్నవారినిగురించి నువ్వాలోచించవు. వారంటే నీకు సానుభూతిలేదు...ఎందుకలా విచారిస్తావ్ గోపాలం?"

"ఏమీలేదు. ఈ సంతోషంతో ఎంతకాలం జీవించ డమా అని?"

"మంచిదో, చెడ్డదో ఉన్న లోకమిది. చేతనైతే నీకు కావలసినవిధంగా దాన్ని మార్చుకో. లేదా, అది చెప్పినట్టుగా విను. ఇంతకుమించి మరో పరిష్కారమంటూ లేదు" అన్నాడతను.

గోపాలానికి అత నన్న మాటలు నిజమేననిపించాయి.